క్లుప్తంగా

వైభవంగా గోదావరికి నిత్య హారతి



గోదావరికి నిత్య హారతి ఇస్తున్న పండితులు

సీటీఆర్‌ఐ: గోదావరి నిత్యహారతి కన్నుల పండువగా జరిగింది. ఆదివారం రాత్రి 6.30 గంటలకు ప్రారంభమైన ఈ నిత్య హారతిని చూడడానికి స్థానికులే కాకుండా చుట్టుపక్కల ప్రజలు వచ్చారు. దక్షిణ గంగగా పేరుగాంచిన గోదావరి నదికి గంగా నది తరహాలో నిత్యహారతి ఇస్తున్న సంగతి తెలిసిందే. ప్రతి రోజు రాత్రి 6.30 గంటల నుంచి హారతిని ఇస్తున్నారు. పుష్కరఘాట్ వద్ద ఎంతో ప్రతిష్టాత్మకంగా దేవదాయ ధర్మదాయ శాఖ, శ్రీవీర వెంకట సత్యనారాయణస్వామి వారి దేవస్థానం(అన్నవరం) ఆధ్వర్యంలో ఈ నిత్యహారతిని ఇస్తున్నారు.

వైభవంగా గురుశ్రీ పురస్కారాలు

ముగిసిన భరతముని ఆరాధనోత్సవాలు-2023



గురుశ్రీ పురస్కారాన్ని అందుకుంటున్న నాగజ్యోతి

సీటీఆర్‌ఐ: గోదావరి తీరం రెండు రోజు నృత్య నీరాజనంతో ఉప్పొంగిపోయింది. గత రెండు రోజులుగా జరుగుతున్న భరతముని ఆరాధనోత్సవాలు ఆదివారం రాత్రి ముగిశాయి. శనివారం ప్రారంభమైన ఈ భరతముని ఆరాధనోత్సవాలు 2023 కార్యక్రమంలో సుమారు 150 మందికి పైగా నృత్య కళాకారులు తమ నాట్యాన్ని ప్రదర్శించారు. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ నృత్యాభినయాలు రాత్రి 10 గంటల వరకు జరిగాయి. భారతనాట్యం, కూచిపూడి, ఆంధ్రనాట్యంతో ప్రేక్షలను మంత్ర ముగ్ధులను చేశారు. స్థానిక శ్రీవెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో స్వరమహతి కళా పరిషత్ ఆధ్వర్యంలో భరతముని ఆరాధనోత్సవాలు-2023 ముగింపు వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వరమహతి కళా పరిషత్ నిర్వాహకుడు ఆదిత్య కిరణ్ మాట్లాడుతూ భరతముని ఆరాధనోత్సవాలు గత ఏడాది హైదరాబాద్‌లో నిర్వహించామని, ఈ సంవత్సరం సాంస్కృతిక రాజధాని రాజమహేంద్రవరంలో నిర్వహిస్తున్నామన్నారు. నాట్య తపస్సు, నాట్య భూషణ్, గురుశ్రీ పురస్కారాలను అందచేశామన్నారు. భరతముని ఆరాధన ఉత్సవంలో భాగంగా కొంతమూరుకు చెందిన శ్రీ రాజరాజేశ్వరి కూచిపూడి నృత్య కళాశాల నాట్యాచారిణి హేమాద్రి నాగజ్యోతితో పాటు మరో 25 మందికి గురుశ్రీ పురస్కారాలను అందచేశారు. నృత్యాంజలి అకాడమీ ఆఫ్ డాన్స్, మ్యూజిక్ చైర్మన్ హరి లోకేష్ పాల్గొన్నారు.

వృద్ధులను గౌరవించండి



సంజీవరావును సత్కరిస్తున్న రౌతు

సీటీఆర్‌ఐ: వృద్ధులను గౌరవించాలని, వారిని ప్రేమగా ఆదరించాలని సీనియర్ సిటిజన్స్ ప్రజా సంక్షేమ వేదిక అధ్యక్షుడు అశోక్‌కుమార్ జైన్ అన్నారు. 33వ ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక ఏబీ నాగేశ్వరరావు పార్కు వద్ద గల డేకేర్ భవనం వద్ద విశిష్ట సీనియర్ సిటిజన్స్‌కు ఆత్మీయ సత్కారం జరిగింది. వివిధ రంగాల్లో నిష్ణాతులైన సీనియర్ సిటీజన్స్‌కి సత్కారం చేశారు. బీర వాసుదేవరావు, గుంటు రాములు, బూరాడ రామకృష్ణ, కెె. సంజీవరావు వంటి 25 ప్రముఖులకు జీవిత కాల సాఫల్య పురస్కారాన్ని అందచేశారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, మహంతి లక్ష్మణరావు, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

వారి డాక్టరేట్‌లు రాష్ట్రానికే గర్వకారణం

విద్యా కుసుమాల ఆత్మీయ సత్కారం సభలో ఎంపీ భరత్‌రామ్



డాక్టరేట్‌లు పొందిన వారిని సత్కరిస్తున్న ఎంపీ భరత్‌రామ్ తదితరులు

సీటీఆర్‌ఐ: ఒకే కుటుంబంలో ముగ్గురు వ్యక్తులు ఒకే ఏడాది డాక్టరేట్‌లు సాధించడం అసాధారణమని, మూడు పీహెచ్‌డీలు సాధించిన ఆ కుటుంబం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమనీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. డాక్టర బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గున్నెపల్లి గ్రామానికి చెందిన పాము ఆనంద్, పాము సత్య వరప్రసాద్, ఆయన భార్య పాము శాంతి కుటుంబం ఒకే ఏడాది ఆంధ్ర యూనివర్శిటీ నుంచి పీహెచ్‌డీలు సాధించిన సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వేదిక కన్వీనర్, మాజీ కార్పొరేటర్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు అజ్జరపు వాసు సారధ్యంలో ఆదివారం నగరంలోని 48వ డివిజన్లో ఉన్న మదర్ థెరిసా విగ్రహం వద్ద ఆ ముగ్గురు విజేతలకు ఆత్మీయ సత్కారం జరిగింది. అంబేడ్కర్ సేవా కేంద్రం వ్యవస్థాపకులు డాక్టర్ గుబ్బల రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సత్కార సభలో ముఖ్య అతిథులుగా ఎంపీ మార్గాని భరత్‌రామ్, వైఎస్సార్ సీపీ అర్బన్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మార్గాని మాట్లాడుతూ కోనసీమలోని ఒక కుగ్రామమైన గున్నెపల్లిలో పేద కుటుంబంలో జన్మించిన వ్యక్తులు విద్యారంగంలో ఇంతగా రాణించడం అభినందనీయమని అన్నారు. బహుశ ఇది ప్రపంచ రికార్డును సాధించే అవకాశం ఉందని, ఈ విద్యా కుసుమాలకు అవసరమైన సహకారాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. డాక్టర్ గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకుని నేటి సమాజంలో విద్యార్థులు ఉన్నతమైన విద్యను అభ్యసించేందుకు ప్రణాళికను రూపొందించుకుని ముందడుగులు వేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ గుబ్బల రాంబాబు మాట్లాడుతూ విద్యారంగంలో రాణించడం ద్వారా మంచి సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వేదిక కన్వీనర్ అజ్జరపు వాసు మాట్లాడుతూ ఒకే కుటుంబంలో మూడు డాక్టరేట్‌లు ఏకకాలంలో సాధించిన ముగ్గురు తన కుటుంబానికి చెందిన వారు కావడం ఆనందంగా ఉందని తెలిపారు. డాక్టరేట్ పట్టాలను సాధించిన పాము ఆనంద్, పాము సత్య వరప్రసాద్, పాము శాంతిలను ఎంపీ భరత్‌రామ్, గూడూరి శ్రీనివాస్ చేతుల మీదుగా సత్కరించారు. నక్కా శ్రీనగేష్, ఎస్‌వి శ్రీనివాస్, పీతా రామకృష్ణ, ఎలిపే శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఏపీ ఫైబర్ నెట్ కేబుల్ సర్వీసెస్‌ను ప్రారంభించిన చందన

కడియం: వేమగిరి గ్రామంలో జగనన్న కాలనీల్లో గృహాలకు ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ కేబుల్ సర్వీసెస్‌ను ఆదివారం ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ప్రారంభించారు. చందన మాట్లాడుతూ ప్రైవేట్ కేబుల్ సర్వీసెస్‌కు దీటుగా తక్కువ ఖర్చుతో ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ కేబుల్ సర్వీసెస్ మనకు అందుబాటులోకి వచ్చిందన్నారు. పార్టీ నాయకులు కట్టా జమీందర్, గుబ్బల నాగార్జున, ఏపి ఫైబర్‌నెట్ కేబుల్ సర్వీసెస్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చందన

కడియం గ్రామంలో శ్రీలక్ష్మీగణపతి ఆలయం వినాయక మహోత్సవాలలో భాగంగా ఆదివారం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో చందన నాగేశ్వర్ పాల్గొని అన్నదానం చేశారు.

4న సీపీఎం నిరుద్యోగ సదస్సు

ప్రకాశం నగర్ : సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 4న రాజమహేంద్రవరంలో రాష్ట్ర నిరుద్యోగ సదస్సును నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నగర కార్యదర్శి బి.పవన్, జిల్లా కమిటీ సభ్యుడు జువ్వల రాంబాబు, బి.రాజులోవ, ఎం.సుందరబాబు, ప్రసన్న కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక శ్యామలాసెంటర్‌లో గల సీపీఎం కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ నిర్వహించారు.

నర్సరీ రంగంలో గొల్లపల్లి సేవలు అభినందనీయం



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న ఎంపీపీ ప్రసాద్

కడియం: నర్సరీ రంగంలో గొల్లపల్లి శ్రీనివాస్ సేవలు అభినందనీయమని కడియం మండల పరిషత్ అధ్యక్షుడు వెలుగుబంటి వెంకట సత్య ప్రసాద్ పేర్కొన్నారు. ఇటీవల విజయవాడలో జరిగిన టైమ్స్ బిజినెస్ అవార్డ్ ఫంక్షన్ లో ప్రముఖ నటి మెహ్రీన్ చేతుల మీదుగా మోస్ట్ ప్రెస్టేజెస్ నర్సరీ అవార్డు అందుకున్న జనక మునేశ్వర నర్సరీ అధినేత గొల్లపల్లి వెంకటేశ్వరరావు (శ్రీనివాస్)ను ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కడియంలో వెలుగుబంటి కార్యాలయం వద్ద జరిగిన ఆదివారం జరిగిన కార్యక్రమంలో పూలమాలలు, శాలువాలతో సత్కరించి శ్రీనివాస్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్త ప్రసిద్ధిగాంచిన కడియం నర్సరీ రంగానికి శ్రీనివాస్ లాంటి రైతులు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఈ ప్రాంత నర్సరీ రైతులు గర్వపడే విధంగా ప్రతిష్టాత్మకమైన టైమ్స్ బిజినెస్ సంస్థ ద్వారా ప్రెస్టేజెస్ నర్సరీ అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు. వెన్నపు అయ్యప్ప, పల్ల దుర్గారావు, గణేశుల చక్రవర్తి, కామిరెడ్డి చిన్న, ఉండమట్ల దుర్గారావు, పరిమి ఉమా శంకర్, నైజం వెంకన్న,శివ, తోట సతీష్, జగతా వెంకటేష్, పలువురు నర్సరీ రైతులు నాయకులు పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

రాజమహేంద్రవరం రూరల్: రాయుడుపాకలు గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఈబీ రాజమహేంద్రవరం నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పీవీ రమణ తెలిపారు. రాయుడుపాకలు గ్రామంలో వీరమల్ల నాగేశ్వరరావును అరెస్టు చేసి, అతని వద్ద నుంచి 180ఎంఎల్ మద్యం బాటిళ్లు 12 స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అన్న సమారాధన

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్) రాజమహేంద్రవరం ప్రధాన రైల్వేస్టేషన్ రోడ్లో ఉన్న శ్రీ గణపతి మందిరం వద్ద 68వ శ్రీగణపతి నవరాత్ర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ముగింపు ఉత్సవంలో భాగంగా ఆదివారం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కమిటీ ప్రెసిడెంట్ ధర్మాల శంకర్‌రెడ్డి మాట్లాడుతూ గణపతి సేవా సంఘం ఆధ్వర్యంలో ఉత్సవాలు ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి వేలాది మంది పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారన్నారు. ఉత్సవాల నిర్వహణకు సహకరించిన స్థానికులకు, ప్రముఖులకు, అధికార ప్రజా ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉత్సవ కమిటీ సభ్యులు వివిధ సాంస్కృతిక కళాకారులను, భజన సంఘం సభ్యులను, ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు దాసరి లక్ష్మీనారాయణ, అధ్యక్షుడు ధర్మాల శంకర్ రెడ్డి, కార్యదర్శి కొయ్య కుర్మారెడ్డి, కోశాధికారి బేరి సూర్యనారాయణ రెడ్డి, ఆర్గనైజర్ సిరపు వినాయకరావు, కమిటీ సభ్యులు సత్కరించారు.

ఏకబాబును పరామర్శించిన చందన

ధవళేశ్వరం: మాతృ వియోగంతో బాధపడుతున్న ధవళేశ్వరం మాజీ సర్పంచ్ పిన్నింటి ఏకబాబును ఆదివారం వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ కో-ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ పరామర్శించారు. ఇటీవల ఏకబాబు మాతృమూర్తి పిన్నింటి అనసూయ మృతి చెందారు. ఈ సందర్భంగా పిన్నింటి అనసూయ చిత్రపటానికి చందన నాగేశ్వర్ పూల మాల వేసి నివాళులు అర్పించారు.

దర్శకులకే దర్శకుడు ఆదుర్తి

వర్ధంతి సభలో పలువురి నివాళి



దర్శకుడు ఆదుర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జిత్‌మోహన్‌మిత్ర, మరిడయ్య తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు ఎన్నో విజయవంతమైన చిత్రాలు అందించి, ఆ రోజుల్లో తెలుగు సినీ ఖ్యాతిని ఇనుమడింప జేశారని పలువురు పేర్కొన్నారు. దర్శకులకే దర్శకుడైన ఆదుర్తి రాజమండ్రి వాసి కావడం మన అదృష్టమన్నారు. అడబాల మరిడయ్య ఆధ్వర్యంలో స్థానిక జిత్‌మోహన్ మిత్రా కళావేదిక దగ్గర ఆదివారం ఉదయం ఆదుర్తి సుబ్బారావు వర్ధంతి, అక్కినేని నాగేశ్వరరావు నటించిన దొంగరాముడు సినిమా 68 వసంతాల వేడుక సంయుక్తంగా నిర్వహించారు. నటగాయకులు జిత్ మోహన్ మిత్రా మాట్లాడుతూ ఆదుర్తి సుబ్బారావుతో గల అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. దర్శకుడు కావాలన్న ఉద్దేశంతో ఆరోజుల్లో బొంబాయి వెళ్ళిపోయి శిక్షణ పొంది, అమర సందేశం సినిమాతో దర్శకుడయ్యాడని, మూగమనసులు సినిమా గోదావరి తీరంలో తొలి అవుట్ డోర్ చిత్రంగా తీసి సంచలన విజయం అందుకున్నారని వివరించారు. ఇదే సినిమా మిలన్ పేరుతో హిందీలో కూడా దర్శకత్వం వహించి అక్కడ కూడా విజయం సాధించారని అన్నారు. ఆయన ముగ్గురు సోదరులు కూడా సినిమా రంగంలోనే పనిచేశారని అన్నారు. ఇక దొంగరాముడు సినిమా అద్భుత విజయం అందుకుందని పేర్కొన్నారు. అడబాల మరిడయ్య మాట్లాడుతూ తెలుగు వారు గర్వించ దగ్గ ఆదుర్తి సుబ్బారావు రాజమండ్రి వాసి కావడం మన అదృష్టమన్నారు. ప్రస్తుతం బాహుబలి సినిమాతో పశ్చిమ గోదావరి జిల్లా వాసి రాజమౌళి తెలుగు సినిమాకు అంతర్జాతీయ ఖ్యాతి తెచ్చారని అయితే ఆరోజుల్లో జాతీయ ఖ్యాతిని మూగ మనసులు సినిమా ద్వారా ఆదుర్తి తెచ్చారని గుర్తు చేశారు. అక్కినేని అభిమాన సంఘం నాయకుడు ఏఎస్ ఆనంద్, వి.జగపతి, గిరజాల సోమరాజు నాయుడు మాట్లాడుతూ ఆదుర్తి సుబ్బారావుని కీర్తించారు. సుక్కురెడ్డి శ్రీనివాసరావు, పిచ్చుక మహేష్, బీఎస్ఎన్ఎల్ మూర్తి, డీఎస్ఎస్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బీసీల మహాసభను విజయవంతం చేయండి

ఎంపీ, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ బోస్



సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వర్, చిత్రంలో ఎంపీ బోస్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గ పరిధిలో ఈ నెల మూడవవారంలో నిర్వహించబోయే బీసీల మహాసభను విజయవంతం చేయాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ పిల్లి సుబాష్‌చంద్రబోస్ పిలుపునిచ్చారు. ఆదివారం శాటిలైట్‌సిటీ గ్రామంలో జక్కంపూడి రామ్మోహనరావు కమ్యూనిటి హాల్లో బీసీల మహాసభ సన్నాహక సమావేశం రాష్ట్ర శెట్టిబలిజ, గౌడ, ఈడిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పాలిక శ్రీను అధ్యక్షతన జరిగింది. పిల్లి సుభాష్‌చంద్ర బోస్, ఏపీగ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్, పార్టీ రూరల్ నియోజకవర్గ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. ఎంపీ బోస్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ సంక్షేమానికి ఎనలేని కృషిచేస్తున్నారన్నారు. రాజకీయంగా నామినేటెడ్ పదవులలో బీసీలకు సముచిత స్థానం కల్పించి గౌరవిస్తున్నారన్నారు. బీసీలందరూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వెన్నుదన్నుగా నిలబడి రాబోయే ఎన్నికలలో సంపూర్ణ మద్దతు ఇవ్వాలని కోరారు. చందన నాగేశ్వర్ మాట్లాడుతూ గత ఎన్నికలలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంలో బీసీ సంఘీయుల పాత్ర ఎంతో ఉందన్నారు. రాబోయే ఎన్నికల ముందే మనమందం ఈ బీసీ మహాసభలో కలుసుకుని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీలంతా అండగా నిలుస్తామన్న భరోసా ఇవ్వాలని చందన కోరారు. రూరల్ నియోజకవర్గ పరిశీలకులు పేరి కామేశ్వరరావు(పీకే రావు), వైఎస్సార్ సీపీ నేతలు, బీసీ సంఘీయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కారుణ్యానంద స్వామి జయంతి ఘనంగా నిర్వహిస్తాం



సమావేశంలో పాల్గొన్న కొండబాబు తదితరులు

సీటీఆర్‌ఐ: మానవ సేవయే మాధవ సేవ అన్న స్ఫూర్తితో శ్రీ గౌతమీ జీవ కారుణ్య సంఘాన్ని స్థాపించిన కారుణ్యానంద స్వామి జయంతిని అక్టోబర్ 10న ఘనంగా నిర్వహించనున్నట్లు చైర్మన్ బర్రె కొండబాబు అన్నారు. ఆదివారం స్థానిక ఆశ్రమం కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన బోర్డు డైరెక్టర్ల సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆశ్రమ అభివృద్ధికి, ఆస్తుల పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఏపీ పేపర్ మిల్ సహకారంతో నిర్మించిన భోజనశాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. వృద్ధులకు, అభాగ్యులకు నీడనిస్తున్న ఆశ్రమ ఆదాయ మార్గాలను పెంచడానికి రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, నగర కోఆర్డినేటర్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్, పార్టీ పెద్దల సహకారంతో కృషి చేస్తామన్నారు. జోలె పట్టి భిక్షాటన చేసి లెప్రసి బాధితులకు, వృద్ధులకు, అనాధ పిల్లలకు బతికున్నంత కాలం సేవ చేసి, తదనంతరం ఆశ్రమ నిర్వహణకు నిధులు, ఆస్తులు సమకూర్చిన మహోన్నత వ్యక్తి కారుణ్యానంద స్వామి జీవిత చరిత్రను అందరికీ తెలియచేయాల్సిన అవసరం ఉందన్నారు. అక్టోబర్ 8న వర్ధంతి కార్యక్రమం, 10న జయంతి ఉత్సవాలకు ప్రజాప్రతినిధులను, దాతలను, నగర ప్రముఖులను భాగస్వామ్యం చేస్తామన్నారు. బోర్డు డైరెక్టర్లు అడపా రఘు, బత్తిన అన్నవరం, పిల్లి నాగేంద్ర ప్రసాద్, చల్లంగి ఏడుకొండలు, నాగుపల్లి దేవి, చిట్టాబత్తుల అనంత లక్ష్మీ, తమ్మిశెట్టి రాధిక పాల్గొన్నారు.

దేవాంగులు సంప్రదాయబద్ధంగా ఎదగాలి



సావనీరును ఆవిష్కరిస్తున్న చందన నాగేశ్వర్ తదితరులు

సీటీఆర్‌ఐ: దేవాంగ సంఘీయులు సంప్రదాయబద్ధంగా ఎదగాలని రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి కాలెపు సత్యనారాయణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక జాంపేటలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి కల్యాణ మంటపంలో జరిగిన 22వ దేవాంగ వధూవరుల పరిచయ సదస్సులో కాలెపు సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ కట్నాలను త్యజించి, ధనికా పేద తారతమ్యం లేకుండా వివాహాలు చేసుకుని దేవాంగులందరూ సమైక్యంగా మెలగాలన్నారు. దేవాంగ వధూవరుల పరిచయ వేదికను 1998లో దేవాంగ ప్రముఖులు బొమ్మన సుబ్బారావు సారధ్యంలో ఏర్పాటు అయిందని అప్పటి నుంచి క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని, ఇప్పటికీ 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్నామన్నారు. దేవాంగజాతి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బలోపేతంగా ఎదుగుతోందని, శ్రీశైలం, కాశీలలో నిత్య అన్నదాన సత్రాలు ఏర్పాటు చేసుకున్నామని, ఇప్పుడు తిరుపతిలో రూ.50 కోట్లతో నిత్య అన్నదాన సత్రం నిర్మిస్తున్నామని, అది త్వరలోనే పూర్తి కాగలదని కాలెపు సత్యనారాయణమూర్తి పేర్కొన్నారు. సభకు రాజమండ్రి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు రొబ్బి విజయ శేఖర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక సావనీరును తిరుపతి దేవాంగ సత్రం అధ్యక్షుడు బొమ్మన దుర్గాప్రసాద్ ఆవిష్కరించారు. వధూవరుల డిజిటల్ ప్రదర్శనను రాష్ట్ర పచ్చదనం సుందరీకరణ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రూర ల్ కోఆర్డినేటర్ చందన నాగేశ్వర్ ప్రారంభించారు. తొలుత కల్యాణ మంటపం డైరెక్టర్ చింతా చలపతి స్వాగతం పలికారు. మాజీ శాసనసభ్యులు చందన రమేష్, ఆంధ్రప్రదేశ్ దేవాంగ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి పుచ్చల రామకృష్ణ, పాల్గొన్నారు.

తల్లిదండ్రులను ఆదరించడం బాధ్యత



ప్రపంచ వృద్ధుల దినోత్సవంలో కేక్ కట్ చేస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ప్రత్యూషకుమారి

రాజమహేంద్రవరం సిటీ: కన్న తల్లిదండ్రులను ఆదరించడం ప్రతి ఒక్కరూ కనీస బాధ్యతగా తీసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి ప్రత్యూష కుమారి పిలుపునిచ్చారు. ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం లాలాచెరువులోని స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ వృద్ధులు ప్రభుత్వం ఇస్తున్న పెన్షన్‌ను వారి కోసం ఖర్చు పెట్టుకుని చివరి దశలో ఆనందంగా గడపాలని కోరారు. పిల్లల పట్ల అవ్యాజమైన ప్రేమానురాగాలతో సంపాదించిందంతా మరల తిరిగి కుటుంబ సభ్యులకి ఇవ్వాలనుకోవడం సరి కాదని ఆమె అభిప్రాయపడ్డారు. స్వర్ణాంధ్ర సేవా సంస్థ వృద్ధులు నిరాశ్రయుల కోసం చాలా మంచి సేవలు అందిస్తుందని ఆమె కొనియాడారు. వృద్ధుల వికలాంగుల సంక్షేమ శాఖ ఉపసంచాలకులు బీ.రామ్ కుమార్ మాట్లాడారు. తొలుత న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ప్రత్యూషకుమారి కేక్ కట్ చేసి వృద్ధులకు తినిపించారు. స్వర్ణాంధ్ర నిర్వాహకులు రాంబాబు ఏర్పాటు చేసిన కాస్మోటిక్స్, పండ్లు, చీరలు, దుప్పట్లు 100 మంది వృద్ధులకు పంపిణీ చేశారు. స్వర్ణాంధ్ర సభ్యులు డాక్టర్ ఆనంద్, స్వర్ణాంధ్ర మేనేజర్ హరికృష్ణ ఇలియాస్, న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమాజ నిర్మాణమే లక్ష్యం



జిల్లా కోర్టు ప్రాంగణంలో సేవా కార్యక్రమంలో పాల్గొన్న ఇన్‌చార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి రాజీవ్



స్వచ్ఛతా హి సేవా పరిశుభ్రత కార్యక్రమంలో పాల్గొన్న కెనరా బ్యాంక్ సిబ్బంది



శ్రమదానం చేస్తున్న ఎస్పీ జగదీష్

కడియం: స్వచ్ఛ భారత్ నిర్మించాలనే 'బాపు' కలను నెరవేర్చాలని దేశ ప్రజానీకానికి ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు మేరకు కడియం మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, జేగురుపాడు గ్రామ సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హి కార్యక్రమాన్ని నిర్వహించారు. జేగురుపాడులో రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలను, చెత్తను తొలగించారు. స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంగా ప్రతి గ్రామం, వీధి, పట్టణం.. అంతటా స్వచ్ఛతను పాటించవలసిన ఆవశ్యకత ఉందని స్టాలిన్ తెలిపారు. ఎంపీటీసీ సభ్యుడు ఆకుల సుధాకర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్పీ జగదీష్ శ్రమదానం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ప్రధానమంత్రి ప్రవేశపెట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా సెంట్రల్ జైలును ఆనుకుని ఉన్న పార్కులో ఎస్పీ పి.జగదీష్ ఆదివారం శ్రమదానం చేశారు. 'ఏక్ తారీక్ ఏక్ ఘంటే'లో భాగంగా ఉదయం 10 నుంచి 11 గంటలవరకు ఆయన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాలలో ఉద్యోగులు భాగస్వామ్యం కావడం అభినందనీయమని ఎస్పీ అన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో...

బీజేపీ కడియం మండల అధ్యక్షుడు నాగులపల్లి వీరబాబు ఆధ్వర్యంలో బుర్రిలంక ఎంపీపీ స్కూలు ఆవరణలో ఆదివారం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం కడియపులంక సత్రం వద్ద గల మహాత్మా గాంధీ, సుభాష్ చంద్రబోస్, నెహ్రూ విగ్రహాలను శుభ్రం చేశారు. రాష్ట్ర కిసాన్ మోర్చ కార్యవర్గ సభ్యులు కొటికలపూడి వెంకటేశ్వర రావు, జిల్లా ఉపాధ్యక్షుడు కరుటూరి శ్రీనివాస్, మండల ఇన్‌చార్జి ఒంటెద్దు స్వామి, జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి బొరుసు సుబ్రహ్మణ్యం, మండల ప్రధాన కార్యదర్శి చిక్కాల శ్రీనివాస్ శ్రమదానం చేశారు.

వేమగిరితోట ఎంపీపీ పాఠశాలలో..

వేమగిరితోట-1 రామాలయం వీధి ఎంపీపీ పాఠశాలలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం ప్రధానోపాధ్యాయులు కె.జయరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల విద్యాశాఖాధికారి వి.లజపతిరాయ్ శ్రమదానంలో పాల్గొన్నారు. ప్రతి రోజు ఒక గంట ఇలా స్వచ్ఛతాహిసేవ కార్యక్రమం నిర్వహిస్తే ఆనందంతో పాటు ఆరోగ్యం చేకూరుతుందని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. అనంతరం ఎంఈవో లజపతిరాయ్ , ఉపాధ్యాయులు పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఉపాధ్యాయులు సతీష్‌బాబు, అంగన్‌వాడీ టీచర్ కుమారి పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛతా హి సేవా

ప్రకాశం నగర్ : కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం కెనరా బ్యాంక్ ప్రాంతీయ కార్యాలయం సిబ్బంది స్థానిక వెంకటేశ్వరనగర్ వాకర్స్ పార్కులో స్వచ్ఛతా హి సేవా పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్యాంక్ ఏజీఎం టి.రవిచంద్ర ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బ్యాంక్ అనేక సామాజిక సేవ కార్యక్రమాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. నగరపాలక సంస్థ పారిశుధ్య సిబ్బందికి సేఫ్టీ ఫ్లోర్సెంట్, ఏప్రానులు, గ్లౌజ్‌లను అందజేశారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే మనమందరం సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని, అందువలన ప్రజలందరూ ప్రధాని నరేంద్రమోదీ పిలుపునిచ్చిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొనాలని రాజమహేంద్రవరం ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ (ఈపీఎఫ్‌వో) ప్రాంతీయ కమిషనర్ మనోజ్ కుమార్ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వీఎల్‌పురంలోని ఈపీఎఫ్ కార్యాలయం, పరిసర ప్రాంతాలలో ఉద్యోగులు శ్రమదానం పెద్ద ఎత్తున నిర్వహించారు. అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడి శ్రీనివాస్, కార్యాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈపీఎఫ్ పెన్షనర్లను రీజనల్ పీఎఫ్ కమిషనర్ మనోజ్‌కుమార్ ఘనంగా సత్కరించారు. అనంతరం ఈపీఎఫ్ కార్యాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.

కోర్టు ఆవరణలో..

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): మనం పని చేసే ప్రాంతం, కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఒకటవ అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇన్‌ఛార్జి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పీఆర్ రాజీవ్ సూచించారు. జిల్లా కోర్టు ఆవరణలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రత , పరిరక్షణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ హై కోర్టు ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల్లో ' స్వచ్ఛాతా హి సేవా' కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ వంతుగా శ్రమదానం కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా భాగస్వామ్యం అవ్వాలని పిలుపు నిచ్చారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

42 బెటాలియన్ ఆధ్వర్యంలో..

42వ బెటాలియన్ స్వచ్ఛతా హి సేవా నిర్వహించింది. జిల్లా పోలీసు శిక్షణ కేంద్రంలో 42వ బెటాలియన్ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి 11 గంటల వరకు పుష్కర ఘాట్ వద్ద భారీ సామూహిక పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో నగర ప్రజలు, యువత పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో...

స్థానిక ఆర్ట్స్ కళాశాలలో ఒకటో తారీఖు, ఒక గంట అనే నినాదంతో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో చుట్టుపక్కల ప్రాంతాలు, కళాశాల ఆవరణను పరిశుభ్రం చేశారు. కళాశాల ఆర్జేడీ చప్పిడి కృష్ణ పాల్గొన్నారు.

పార్కును శుభ్రం చేసిన హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు

ధవళేశ్వరం: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ధవళేశ్వరం బ్యారేజీ వద్ద ఉన్న పార్కులను హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగులు, కార్మికులు శుభ్రం చేశారు. ఆదివారం ఉదయం కార్యక్రమం చేపట్టారు. హార్లిక్స్ ఫ్యాక్టరీ హెచ్ఆర్ మేనేజర్ సంపత్ శ్రీనివాస్, ఇంజినీరింగ్ మేనేజర్ శ్రీధర్‌బాబు మాట్లాడుతూ మరో రెండు రోజులు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో హార్లిక్స్ ఫ్యాక్టరీ కార్మికులు ఎన్‌వీ శేఖర్, కొయ్యన మురళీకృష్ణ, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.